యూనిట్ 2

# 7. చీమల బారు

## చిత్రం చూడండి - ఆలోచించండి - మాట్లాడండి



★ చిత్రంలో ఎవరెవరున్నారు? ఏం చేస్తున్నారు?

★ పిల్లలందరూ వరుసలో ఎందుకు వెళుతున్నారు?

★ ఎవరైనా బస్సు ఇలాగే ఎక్కుతారా?

★ ఇలా ఇంకా ఎక్కడెక్కడ వరుసగా వెళతారు?


**పిల్లలకు సూచనలు :**

★ పాఠంలోని చిత్రాలను చూడండి. చిత్రాలను గురించి మాట్లాడండి.

★ పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద గీత గీయండి.

★ గీత గీసిన పదాలకు అర్థాలను మీ మిత్రులను గాని, ఉపాధ్యాయులను గాని అడిగి లేదా పదాలు - అర్థాలు అన్న పట్టికలో చూసి తెలుసుకోండి.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ



ఓహో! మీరెక్కడికి
ఓ చిన్న చీమల్లారా?
ఏ సీమకు మీరేగెదరు
ఈ తీరున బారుకట్టి!
ఎక్కడికి, ఎక్కడికి?
ఈ సమూహ మెక్కడికి?
కయ్యానికా, వియ్యానికా?
అయ్యారే, మీరేగుట?
ఒకరి వెనుక ఒకరు
మిగుల ఓరిమితో పోయెదరు
ఎవరోయి మిము నడిపెడి

ఇంగితజ్ఞు లింత ఘనులు?
ఎవరో ఒక నేత లేక
ఇంత కట్టుదిట్టముగా
మనుషులమే నడువలేము
మరి మీ పోకడ చిత్రము
పనిపాటలు లేక మీరు
పాలుమాలి తిరగరహో!
ఎక్కడకు ఈ ధాన్యము
ఎవరిళ్ళకు ఈ ఎగుమతి?
మడి మాన్యము లేదు మీకు
మరి ధాన్యము సమకూర్తురు

© SCERT not to be republished



© SCERT not to be republished

కళ్ళము కొక గింజయైన
కావే కొల్లలు కొల్లలు
ఏయే పొలములు తిరిగి
ఈ ధాన్యము గూర్చితిరి?
ఎవడు చూపె కడు దుర్గమ-
మైన బ్రతుకు చాల మీకు?
ఈ వివేక మీ పొదుపును
ఎచట నేర్చితిరో గానీ!
ఈ శిక్షణ మనిషికున్న
ఇక లేములు ఎక్కడివి!

ఎవరివద్ద చదువకయే
ఈ విద్దెలు నేర్చితిరి.
కోటివిద్యలైన తుదకు
కూటికె కద మాకైనను.
ఏమేమో నేర్వదలచి
ఎటకెటకో పోయెదము
కండ్లముందు ఎపుడు తిరుగు
ఘనుల కానలేము కదా!


- పొట్లపల్లి రామారావు



## ఇవి చేయండి



### I వినండి - ఆలోచించి చెప్పండి



(అ) గేయాన్ని లయబద్ధంగా పాడండి. అభినయం చేయండి.

(ఆ) చీమలు ఏమేమి ఆహారంగా తీసుకుంటాయి?

(ఇ) చీమలబారును చూసి మీరేం గ్రహించారు? ఎందుకు అలా వెళతాయి?

(ఈ) చీమలబారు గేయంలో మీకిష్టమైన వాక్యాలు ఏవి? అవి ఎందుకు ఇష్టమైనవో చెప్పండి.

### II చదవండి - అర్థంచేసుకొని చెప్పండి - రాయండి



(అ) కింది పదాలు చదవండి. గేయంలో ఎక్కడున్నాయో గుర్తించండి. వాటికి 'O' చుట్టండి.

బారుకట్టి, చీమల్లార, కయ్యానికా, ఎవరోయి, పనిపాటలు, ధాన్యము, విద్దెలు, ఘనులు.

(ఆ) కింది వాక్యాలు చదవండి. భావం చెప్పండి.

"ఈ వివేక మీ పొదుపును
ఎచట నేర్చితిరో గానీ
ఈ శిక్షణ మనిషికున్న
ఇక లేములు ఎక్కడివి?"

(ఇ) పాఠం చదవండి. కింది వాక్యాలలో తారుమారైన పదాలను సరిచేసి చెప్పండి.

లేక పాటలు మీరు పని
తిరగరహో పాలుమాలి
ఈ ఎక్కడకు ధాన్యము
ఎగుమతి ఎవరిళ్ళకు ఈ

(ఈ) గేయం ఆధారంగా కింది వాక్యాలలో ఒప్పు (✓), తప్పు (X) లు గుర్తించండి.

1. చీమలు చాలా సోమరులు. (     )
2. చీమలకు క్రమశిక్షణ ఎక్కువ. (     )
3. పొదుపు చేయడం చీమలనుంచి నేర్చుకోవాలి. (     )
4. చీమలకు ముందుచూపు ఉండదు. (     )
5. చీమల నేత చీమలన్నిటినీ నడిపిస్తాడు. (     )

© SCERT not to be republished

(ఉ) ఒక హల్లుకు వేరొక హల్లు ఒత్తు చేరితే సంయుక్తాక్షరం అవుతుంది కదా! ఇలాంటి సంయుక్తాక్షర పదాలను ఈ పాఠంలోను, వెనకటి పాఠాలలోను కూడా వెతికి రాయండి.

ఉదా :

| విద్య | క్రమశిక్షణ | ఆశ్చర్యం |
|---|---|---|
| | | |

## III రాయండి




(అ) చీమల గొప్పతనాన్ని కవి గేయంలో ఏమని చెప్పాడు?

(ఆ) మనచుట్టూ ఉన్న జంతువులనుంచి మనం చాలా నేర్చుకోవచ్చు. దేనినుంచి ఏమి నేర్చుకోవచ్చో ఆలోచించి రాయండి.

(ఇ) కోటివిద్యలు కూటికొరకే అంటే అర్థమేమిటి?

(ఈ) గేయభావాన్ని సొంతమాటల్లో రాయండి.

## IV పదజాలం



(అ) కింది పదాలు చదవండి. ఒక వరసలో సంబంధంలేని పదానికి 'O' చుట్టండి.

ఉదా : పులి, ఏనుగు, (చీమ,) సింహం

1. కాకి, ఎలుక, పావురం, నెమలి
2. మేఘాలు, భూమి, ఆకాశం, సూర్యుడు
3. ఎరుపు, నలుపు, తెలుపు, పులుపు
4. ఈగలు, దోమలు, తేనెటీగలు, చీమలు
5. బావి, పొలం, చెరువు, నది

(ఆ) కింది పదాలను చదవండి. సరైన అర్థాలతో జతపరచండి.

| | |
|---|---|
| కయ్యం | గుంపు |
| కలిమి | మంచి, చెడు తెలిసినవాడు |
| సహనం | పోట్లాట |
| ఘనులు | వరస |
| బారులు | సోమరితనం |
| సమూహం | సంపద |
| ఇంగితజ్ఞానం | ఓర్పు |
| పాలుమాలి | గొప్పవారు |

© SCERT not to be republished

## V సృజనాత్మకత




**(అ) చీమ ఆత్మకథ రాయండి.**

నేను చీమను. నేను చాలా చిన్నగా ఉంటాను కానీ ........................................

**(ఆ) చీమ గొప్పతనాన్ని తెలుపుతూ కవిత/గేయం/అభినందన లేఖ రాయండి.**

## VI ప్రశంస / ప్రాజెక్టు పనులు



**(అ) చీమలకు సంబంధించిన వివిధ కథలను, సమాచారాన్ని సేకరించి, గోడపత్రికలో పెట్టండి.**

**(ఆ) చీమలను గురించి గేయం చదివారు కదా! ఇదే గేయాన్ని మీ మాతృభాషలో రాయండి.**

## VII భాషను గురించి తెలుసుకుందాం



**(అ) కింది వాక్యాలు ఏ కాలంలో ఉన్నాయో తెలపండి :**

| సం | వాక్యం | కాలం |
|---|---|---|
| 1. | కరీం రేపు కడపకు వెళ్తున్నాడు. | |
| 2. | షరీఫ్ నిన్న సినిమా చూశాడు. | |
| 3. | హారిక పాట పాడుతున్నది. | |
| 4. | కనకమ్మ ఈరోజు వస్తున్నది. | |
| 5. | రుత్విక్ చదరంగం ఆడుతున్నాడు. | |

**(ఆ) కింది పదాలలో సరైన పదంతో ఖాళీలు పూరించండి.**

(నిన్న, నేడు, రేపు, వెళ్తున్నాడు, తెచ్చింది)

1. రాజు .............................. సర్కస్ చూశాడు.
2. రవి రేపు ఢిల్లీ ..............................
3. లలిత కూరగాయలు ....................................
4. కుమార్ .................................. హైదరాబాద్‌నుంచి రావచ్చు.
5. నేను .............................. బడికి వెళ్లాను.





### నేనివి చేయగలనా ?

| | |
|---|---|
| 1. గేయాన్ని లయబద్ధంగా పాడగలను. | ఔను / కాదు |
| 2. గేయ సారాంశాన్ని సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 3. గేయ భావాన్ని సొంతమాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 4. చీమ ఆత్మకథ రాయగలను. | ఔను / కాదు |

© SCERT not to be republished